క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథం లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ సాయిరామ్ నృత్య అకాడమీ నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత, ఆంధ్ర నాట్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ప్రదర్శించిన నృత్యాలు భక్తులను అలరించారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వృద్ధురాలి అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సాధుజాన్ వీధి కొండ ప్రాంతానికి చెందిన తిరుకోవెల నాగేశ్వరమ్మ (80) కోడలు, మనవడితో కలిసి ఉంటుంది. కోడలు కృష్ణవేణి కూరగాయలు విక్రయించేందుకు ఎర్రకట్టకు వెళ్లుతుండగా, నాగేశ్వరమ్మ ఇంట్లోనే ఉంటుంది. గత నెల 15వ తేదీన కృష్ణవేణి కూరగాయలు విక్రయించేందుకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి రాగా ఇంట్లో నాగేశ్వరమ్మ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

10 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):వేసవి సెలవుల్లో విద్యార్థినులు, మహిళలకు శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న శిక్షణలో భాగంగా బ్యూటీషియన్ కోర్సు, మెహిందీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, టై అండ్ డై, పాట్ పెయింటింగ్, క్యాన్వాస్ పెయింటింగ్, 3డి పెయింటింగ్, ఐషన్ ఆర్ట్, మౌల్డ్ ఇట్ వర్క్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9160991218, 9703839116 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రజాశక్తినగర్ రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ టీవీ మురళీకృష్ణ తెలిపారు. తమ ఆస్పత్రి రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, డయాబెటాలజీ, ఆప్తమాలజీ (కంటి వైద్యం) ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, షుగర్‌కు సంబంధించి ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, హెచ్‌బీఎ1సీ నిర్ధారణ పరీక్షలు, సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్, లివర్, కిడ్నీ ప్రొఫైల్, ఇసీజీ, 2డీ ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి రాయితీపై మందులు అందచేస్తామన్నారు. కంటి వైద్య పరీక్షలు డాక్టర్ సి. త్రివేణి నిర్వహిస్తుందని, జనరల్ మెడిసిన్ పరీక్షలు తాను చేయనున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత వైద్య పరీక్షలు ప్రారంభంకానున్నట్లు చెప్పారు.

భవిష్యత్తుకు దిక్సూచి ఎడ్యుకేషనల్ ఎక్స్‌పో

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోలు విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచీ లాంటివని విద్యావేత్త కత్తిరావన్ అన్నారు. చెన్నైకు చెందిన ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఎడ్యుకేషనల్ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోలో 25 స్టాల్స్ ఏర్పాటు చేయగా, దేశంలోని అనేక విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా విద్యాసంస్థల్లో సీటు పొందడం ఎలా, ఫీజుల వివరాలు వంటి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఎస్ఆర్ఎం చెన్నై రామాపురం క్యాంపస్ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ కథిరవన్, టర్నకీ ఈవెంట్స్ సీఇఓ రాధాకృష్ణ, ఐఆర్ఎంఎస్ ఫౌండర్ సీఇఓ రాజా తదితరులు పాల్గొన్నారు. శనివారం కూడా ఈ ప్రదర్శన కొనసాగనుంది.

రేపు ప్రపంచ నవ్వుల దినోత్సవం

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఏటా మే మొదటి ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా నవ్వుల దినోత్సవం జరుపుకుంటారని విజయవాడ లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకులు తొండెపు హనుమంతరావు తెలిపారు. ఈ ఏడాది మే 7న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నవ్వుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజానీకానికి నవ్వడం అనేది ఒక దివ్య ఔషధమని చెప్పారు. నవ్వు ద్వారా ఉల్లాసాన్ని పొందగలుగుతారన్నారు. నవ్వడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

వైభవంగా వెంకన్న గరుడసేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని వెంకటేశ్వరస్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. పౌర్ణమిని పురస్కరించుకొని వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న పురాతన ఆలయం వెంకటేశ్వస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. మూలమూర్తికి ఫలపుష్పసుగంధ ద్రవ్యాలతో పసుపు, చందనాది లేపనాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేకంగా స్వామి వారి వైదిక కార్యక్రమాల్లో ఉభయ దాతలుగా పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనపూజతో ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి, దీక్షిత్ పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా గరుడ సేవ

స్వామి వారి సన్నిధిలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం స్వామి వారికి గరుడ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి ప్రత్యేక హారతులిచ్చి ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది అజయ్‌కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి గరుడ వాహన సేవ

నృసింహునికి చందనాలంకారం

పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని కోదండరామ స్వామి వారి దేవస్థానంలో నృసింహ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శుక్రవారం చందనాలంకారం నిర్వహించారు. జయంతి ఉత్సవంలో భాగంగా శుక్రవారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం ఉండటం, పౌర్ణమి తిథి కావటంతో శుక్రవారం సైతం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేశారు. అందులో భాగంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక తిరుమంజన అభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, సుగంధి ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని రమణీయంగా అలంకరించి వాహనంపై అధిష్టింపజేశారు. ఉత్సవమూర్తికి పూర్తిగా చందనంతో లేపనం చేసి అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని సహస్రనామార్చన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.



నృసింహస్వామి వారికి చందనాలంకారం

కర్రీ పాయింట్‌లో అగ్ని ప్రమాదం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కర్రీ పాయింట్‌లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన శుక్రవారం లంబాడీపేటలో చోటు చేసుకుంది. సీహెచ్. సాంబశివరావుకు చెందిన భవనంలో బాజీరావు కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గ్యాస్ లీకు కావడంతో మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో కేఎల్‌రావు పార్కు రోడ్డులోని కొత్తపేట అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కర్రీ పాయింట్‌లోని సామగ్రితో పాటు భవనం బయట నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు కాలిపోయాయి. సుమారు రూ. లక్ష మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బ్లాక్ నెం: 113లోని ఎఫ్ఎఫ్–4లో నివాసం ఉంటున్న సంధ్య, సతీష్ ఇంటిలో గ్యాస్ లీకు కావడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



కర్రీ పాయింట్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మైనార్టీలకు చంద్రబాబు తీరని ద్రోహం

లబ్బీపేట(విజయవాడతూర్పు): తాను అధికారంలో ఉండగా ముస్లిం మైనార్టీలకు చంద్రబాబు తీరని ద్రోహం చేశారని ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, నగర పాలక సంస్థకో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం అన్నారు. ముస్లింల ద్రోహిగా చంద్రబాబు చరిత్రలో నిలిచి పోతారన్నారు. లబ్బీపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీలకు చేసిందేమీ లేదన్నారు. విదేశీ విద్య, షాదీ తోఫా పేరుతో మోసం చేశారన్నారు. కానీ నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలతో పాటు ముస్లింలకు విదేశీ విద్య పథకం వర్తింపచేయడంతో పాటు, షాదీతోఫాను విడుదల చేశారన్నారు. అంతేకాకుండా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది ఉన్నత చదువులు చదివారన్నారు. డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఎదిగారని గుర్తు చేశారు. ముస్లింలకు వైఎస్ కుటుంబ చేసిన మేలుతో ఎప్పటికీ మైనార్టీలంతా వారికి బాసటగా నిలుస్తారన్నారు. అంతేకానీ పూటకో మాట చెప్పే చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు.

వైభవంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు లాకుల వద్ద వేంచేసి ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ పూర్ణిమ సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ వార్ల కల్యాణం శుక్రవారం వేద పండితులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం జరపడం శుభపరిణామమన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ అధ్యక్షుడు గొర్తి వెంకట మధు సుధనరావు, ప్రదీప్, చిప్పాడ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశ్రీశైలజ, శ్రీనివాసరెడ్డి దంపతులు తెలిపారు. టీటీడీ అర్చకులచే ఎంబీ స్టేడియం ఆవరణలో కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం డెప్యూటీ మేయర్ శ్రీశైలజ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులచే శ్రీనివాస కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సింగ్‌నగర్ ఇందిరానాయక్‌నగర్‌లో ఏర్పాటుచేసిన యాగశాలలో గణపతి హోమం, చండీ హోమం, పూర్ణ హోమం నిర్వహించి అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా సింగ్‌నగర్ ఎంబీ స్టేడియానికి తీసుకువస్తామని తెలిపారు.

టీటీడీ ప్రధాన అర్చకులచే భూదేవి సమేత తిరుమలేశ్వరునికి వసంతోత్సవం, తిరుమలలో మాదిరిగా శ్రీనివాస కళ్యాణం, రాత్రికి మహానివేదన, వేద ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. సుమారు 10 వేల మంది భక్తులు హాజరవుతారన్నారు. స్వామి వారు భక్తులంతా ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అవుతు శ్రీనివాస రెడ్డి, దేవిరెడ్డి ఆంజనేయరెడ్డి, నున్న ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా వెంగమాంబ సంకీర్తనలు

విజయవాడ కల్చరల్:లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని శ్రవణ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సంకీర్తనా కార్యక్రమం మధురంగా సాగింది. భక్తులు వెంగమాంబ జయంతి ఘనంగా నిర్వహించారు. వెంగమాంగ రచించిన సంకీర్తనలను మాన్య మ్యూజిక్ అకాడమీ బృందం, గండదూరి శ్రీనివాస మూర్తి బృందం, ఎన్.జ్యోతి, జి.హంసిని, పి.పద్మసౌమ్య, మోదుమూడి అంజనా సుధాకర్ బృందం గానం చేశారు. తెలిపితే మోక్షము. జయ జయ నృసింహ, సముఖ ఎచ్చరిక తదితర కీర్తనలు ఆలపించారు. సుబ్రహ్మణ్య రాజు సీహెచ్ సూర్యా వాద్య సహకారం అందించారు.

శనివారం నుంచి వారం రోజులపాటు అన్నమయ్య 615 జయంతి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు ప్రసాద్, సత్యబాలు తెలిపారు. ఉదయం 7 గంటలకు పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపం నుంచి అన్నమయ్య విగ్రహం ఊరేగింపు నగర సంకీర్తన జరుగుతుందన్నారు. సంగీత విద్వాంసులు 12 గంటలపాటు అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తారు.



కీర్తనలు గానం చేస్తున్న హంసిని, పద్మ సౌమ్య

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బాలిక మిస్సింగ్ కేసులో సత్యనారాయణపురం పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే మైనర్ ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్యనారాయణపురం, ముత్యాలంపాడుకు చెందిన బాలిక (16) నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల విడుదలైన పరిక్ష ఫలితాల్లో బాలిక ఫెయిల్ అయింది. దీంతో సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు కట్టి చదివిన కళాశాలలోనే ట్యూషన్‌లో చేరింది. గురువారం ఉదయం 8 గంటలకు ట్యూషన్‌కు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వెంకట నారాయణ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లలో సీసీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టగా బాలిక నగరంలోనే ఉండే తన స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లుగా గుర్తించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడంపై నగర సీపీ టీకే రాణా సిబ్బందిని అభినందించారు.

టీడీపీ విమర్శలు సిగ్గుచేటు

పటమట: బాలుడి మృతిపై టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలు సిగ్గుచేటని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. డ్రెయినేజీ మరమ్మతులు జరుగుతున్న సమయంలో ఆరేళ్ల బాలుడు ఆటలాడుకుంటు ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని చెప్పారు. ఈ ఘటనపై టీడీపీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం హేయమైన చర్యని తెలిపారు. బాలుడి చావును రాజకీయ లబ్ధికి వాడుకోవాలి అనుకోవడం దుర్మార్గమని చెప్పారు. ఘటన గురించి తెలియగానే హుటాహుటిన చేరుకుని అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టామన్నారు. కార్పొరేషన్ తరపున తగు నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీ యువజన విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొరివి చైతన్య పాల్గొన్నారు.

పరదేశిబాబు సాహిత్యసేవలు వెలకట్టలేనివి

విజయవాడ కల్చరల్: జంధ్యాల పరదేశిబాబు సాహిత్యసేవలు వెలకట్టలేనివని రసభారతి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు అధ్యాపకునిగా, సాహితీ పరిశోధకునిగా పరదేశిబాబు అనేక పుస్తకాలు రచించారని చెప్పారు. విఖ్యాత కవి కరుణశ్రీ వారసునిగా ఆయన కవితా వారసత్వాన్ని కాపాడుతున్నట్లు తెలిపారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు పరదేశిబాబు సాహితీ సేవలను వివరించారు. పదేశిబాబు రచించిన సారస్వత వ్యాసమాల గ్రంథాన్ని నారాయణరావు ఆవిష్కరించారు. నసీమా పుస్తకాన్ని డాక్టర్ వెన్నా వల్లభరావు, జంధ్యాల మల్లయ్య శాస్త్రి– కృష్ణవేణి విశిష్ట జీవిత విశేషాలను చెట్లపల్లి మారుతీ ప్రసన్న ఆవిష్కరించారు. డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథ విశేషాలను తెలియజేశారు. అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



గ్రంథాల ఆవిష్కరణ సభలో లక్షణరావు, నారాయణరావు, పరదేశిబాబు తదితరులు

బుద్ధుని మార్గం అనుసరణీయం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ప్రజలు సుఖసంతోషాలతో జీవించడానికి బుద్ధుని మార్గం అనుసరణీయమని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ చెప్పారు. బుద్ధపౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం సిద్ధార్థజంక్షన్‌లోని బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ వేలాది సంవత్సరాల క్రితమే మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను అభ్యుదయం వైపునకు బుద్ధుడు మలుపు తిప్పాడన్నారు. నాటి సమాజంలో ఉన్న కుల, మత వివక్షను రూపుమాపడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి బుద్ధుడని అన్నారు. మనిషి కోరికలు, ఆశల్ని నియంత్రించుకోగలిగే విధంగా అనేక విషయాలను ప్రపంచానికి తెలియజేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. బుట్టి రాయప్ప, ఎస్.వెంకట సుబ్బయ్య, ఆర్.పిచ్చయ్య, పేరయ్య, ఆనందరావు, చిన్నప్ప, రాజు, జి.ప్రసాద్, రాము. నారాయణ, గుప్తా, ఆదాం పాల్గొన్నారు.

డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట: డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలు తొలగించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పశ్చిమ నియోజక వర్గం పరిధిలోని 56 వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేటలో జె.పి.అపార్ట్‌మెంట్, 57 వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీ పేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మేజరు అవుట్ ఫాల్ డ్రెయిన్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రధాన అంతర్గత రోడ్లలో కొనసాగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. పాతరాజరాజేస్వరి పేట జె.పి.అపార్ట్‌మెంట్‌లో యూజీడీ నిలిచి అవుట్‌ఫ్లో అవ్వడాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయిన్ల వ్యవహారాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, పట్టణప్రణాళిక విభాగం సమన్వయంతో వ్యవహరించి రోడ్లపై నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రెయిన్లు కల్వర్టులు, మ్యాన్‌హోల్స్ తీసి శుభ్రం చేయాలని, నగరంలో కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు కాలువల ద్వారా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవరోధంగా ఉన్న కాల్వలపై ఉన్న అక్రమణలను తొలగించాలని చెప్పారు. 56 వ డివిజన్ కార్పొరేటర్ యలకల చలపతిరావు, చీఫ్ ఇంజినీర్ యం. ప్రభాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, ఇతర అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై కేంద్రం తన విధానాన్ని ప్రకటించాలని కోరారు. విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం ఓబీసీల మహాధర్నా జరిగింది. వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ 52 శాతం జనాభా కలిగిన ఓబీసీల సమగ్ర అభివృద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సమగ్ర జనగణనలో ఓబీసీ కుల జనగణన చేపట్టాలని, రూపాయి ఖర్చు లేని ఓబీసీ కులగణన చేపట్టడంపై కేంద్రం ఎందుకు వివక్ష చూపుతోందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో బీసీ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఓబీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. సుజన్ సింగ్, ఓబీసీ మహిళా సంఘం విజయవాడ నగర అధ్యక్షురాలు షేక్ నాగూర్ బీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్‌లు మాట్లాడారు. ఓబీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు నాగేంద్ర సింగ్, ఏకే ఫౌండేషన్ చైర్మన్ ఆషా, విజయవాడ నగర ఓబీసీ సంఘం నాయకులు సాయిబాబా, రెడ్డి రమణమ్మ, ఏపీ బొందిలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ తివారి, ఓబీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కే బాలాజీ సింగ్, గుంటూరు నగర కన్వనర్ సున్నం మల్లికార్జున్, గజ్జెర్ల ఆదిలక్ష్మి, దాసరి మనోజ్ కుమార్ , పూజల రాజు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న ఓబీసీ సంఘం నేతలు అంగిరేకుల వరప్రసాద్

మేజిక్‌తో పిల్లల్లో ఆత్మవిశ్వాసం

కృష్ణలంక(విజయవాడతూర్పు):పిల్లలు మూఢ నమ్మకాలను వదిలి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునేందుకు, మంచి అలవాట్లు నేర్చుకోవడానికి మేజిక్ శిక్షణ ఉపయోగపడుతుందని లయోలా కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ ఎస్.పి.రామరాజు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో అమరావతి బాలోత్సవ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ ఇంద్రజాలికుడు క్రాంతికార్ పర్యవేక్షణలో 10 రోజుల ఉచిత మేజిక్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పిల్లలు చదువులలో ముందుటున్నా పది మందిలో కలిసి ఉండలేక నూన్యతాభావంతో ఉంటున్నారని, చురుకుగా ఉండటం లేదన్నారు. అటువంటి వారు మేజిక్ నేర్చుకోవడం ద్వారా సృజనాత్మక పెరుగుతుందని తెలిపారు. షార్ప్‌గా తయారవుతారన్నారు. మేజిక్ రంగంలో ప్రపంచ రికార్డులు నెలకొల్పిన క్రాంతికార్ తనకు వచ్చిన విద్యను పదిమంది పిల్లలకు నేర్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ పిల్లలు చదువులతో పాటు ఆటలు, పాటలు, సంగీతం,మేజిక్, చిత్రలేఖనం లాంటి రంగాలలో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా సమగ్ర అభివృద్ధి చెందుతారన్నారు. ప్రశ్న పిల్లవాని అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మేజిక్ శిక్షణ కార్యక్రమం నిర్వాహకుడు చంద్రశేఖర్, బాలోత్సవం బాధ్యులు యూ.వి.రామరాజు, క్రాంతికిరణ్, రవీంద్ర, ఐజాక్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.



మేజిక్ శిక్షణను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపల్ రామరాజు, ఇంద్రజాలికుడు క్రాంతికార్

నోటి క్యాన్సర్‌ను గుర్తించడంపై శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):నోటి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడంపై గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లలో పనిచేసే మిడ్ లెవల్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రామా బయోటెక్ వారి సౌజన్యంతో విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ పరికరమైన ఓరోస్కోప్ ఉపయోగించి క్యాన్సర్ నిర్ధారించడంపై అవగాహన కలిగించారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించేందుకు ఓరోస్కోప్ పరికరం ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణుల్లో నోటి క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు దోహదపడుతుందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో స్క్రీనింగ్ చేస్తున్నందుకు వారికి శిక్షణ అవసరం ఉందన్నారు. రామా బయోటెక్‌కు చెందిన డాక్టర్ రామరాజు, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ రాజాజీ, నేషనల్ హెల్త్ మిషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ మురళీమోహన్, ఓరల్ మెడిసిన్ , రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అనురాధ, డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సువర్ణ, డాక్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నోటి క్యాన్సర్‌ను గుర్తించడంపై ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కళాకారులు సాంస్కృతిక రాయబారులు

విజయవాడ కల్చరల్:కళాకారుల సేవలను గుర్తించి ప్రోత్సహించాలని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు తెలిపారు. సువర్ణమణి రిథమ్స్ ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని, వారికి గుర్తింపు తీసుకు రావాల్సిన అవసరముందన్నారు. సువర్ణమణి రిథమ్స్ వ్యవస్థాపకుడు మారేపల్లి జోషి మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఉన్న కళాకారులు ఇతర రంగాల వారి సేవలను వెలుగులోకి తీసుకొస్తునట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న గాయకుడు రసూల్‌బాబు, సీనియర్ కీబోర్డ్ ప్లేయర్ జె.రవిబాబు, మురుగా చారిటబుల్ సంస్థ చైర్మన్ ఒమ్మి రమాశంకర్‌ను నిర్వాహకులు సత్కరించారు. బీవీ వీరభద్రరావు, చింతకాలయ చిట్టిబాబు పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్ పాల్గొన్నారు పలువురు గాయనీ గాయకులు తెలుగు చిత్రగీతాలు ఆలపించారు.



సినీ గీతాలు గానం చేస్తున్న గాయనీ గాయకులు